
నేను, గోపాలం బాల్య స్నేహితులం.

ఒకే ఊరిలో పుట్టి పెరిగాం. గోపాలం విజయవాడలో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. ఇద్దరం ఒకే స్కూల్లో ఎస్. ఎస్. ఎల్. సి. వరకు చదివిన తరువాత, వాడికి గుమాస్తాగా విజయవాడలో ఉద్యోగం లభించడం, నేను చదువు మానుకొని, మా గ్రామంలోనే పొలాలు చూసుకుంటూ స్థిరపడిపోవడం జరిగింది. వాడికి నెలకోమారు మా ఊరొచ్చి, రెండు మూడు రోజులు గ్రామంలో గడిపి వెళ్ళటం పరిపాటి

మాది ఏలూరు దగ్గర దెందులూరు గ్రామం. ఏలూరుకి నాలుగు మైళ్ళదూరంలో ఉన్న దెందులూరుకి, జి. టి. రోడ్ మీదనే ప్రయాణం. డైరెక్టు బస్సు కాకపోతే, రోడ్డు మీద బస్సు దిగగానే, ఇంకోమైలు, మైలున్నర వూర్లోకి నడవాలి. ఏలూరు టౌన్ నుండి బస్ సర్వీసు గంట గంటకీ వున్నా, రాత్రి తొమ్మిది గంటలకే ఆఖరిబస్సు బస్సుల కంటే, ఆ గ్రామస్థులు సైకిళ్ళు ఎక్కువగా ఉపయోగించుతారు. ఆ రోజు ఉగాది పండుగ. ఉదయం 9 గంటలకల్లా పొలం వెళ్దాం అని బయలుదేరుతుండగా, గోపాలం వచ్చాడని తెలిసి, వాడ్ని చూసి వెళ్దాం అని వాళ్ళింటి కెళ్ళాను.

నేను వాళ్ళ ఇల్లు చేరేసరికి, వాళ్ళ నాన్న బయటికివెళ్తూ ఎదురయ్యాడు. "ఏమండీ మామయ్యగారూ, గోపాలం వచ్చాడటగా" అంటూ లోపలికి వెళ్ళాను. వాడు మంచం మీద పడుకుని, ముఖం వరకు దుప్పటి కప్పుకుని ఉన్నాడు. "ఏరా తొమ్మిది గంటలయినా ఇంకా పడుకొనే ఉన్నావ్" వాడి కెదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంటూ అడిగాను. "ఇవేళ ఉదయమే ఐదు గంటల కొచ్చాను. కొంచెం జ్వరం తగిలినట్లుందిరా" అని జవాబిచ్చాడు గోపాలం. వాడి మాటవిని ఒళ్ళు ముట్టుకుని చూశాను. జ్వరం తీవ్రంగాఉంది. వాడిమాట నూతి అడుగునుంచి వచ్చినట్లు చాలా నెమ్మదిగాఉంది చలికిలాగుంది కొంచెం వణుకుతున్నాడు! వాడి చూపుల్లో కనిపించిన భయాన్ని కనిపెట్టిన నేను "ఏరా అసలేం జరిగింది"? అడిగాను, అసలు సంగతేమిటో తెలుసుకోవాలని. వాడు చెప్పింది విని అంతులేని ఆశ్చర్య పడ్డాను.

గోపాలం ఆఫీసులో పని ఎక్కువ ఉండటం వలన, సాయంత్రం 8 గంటల వరకు ఆఫీసులో పనిజేసి, స్నానం భోజనం వగైరా ముగించి, రాత్రి విజయవాడలో బసెక్కి ఏలూరు చేరేసరికి రాత్రి 12. 30 గంటలయింది. ఆ ఊళ్ళోనే ఉన్న వాళ్ళ బాబాయ్ గారింటికి వెళ్ళి, ఆయన సైకిలు తీసుకొని,




ఆ రాత్రి ఉండి వెళ్ళమని ఆయన చెప్తున్నా వినిపించుకోకుండా, ఉగాది పండుగకు ఉదయమే ఇంటిదగ్గర ఉండామనే ఉద్దేశ్యంతో రాత్రికి రాత్రే దెందులూరికి బయలుదేరాడు

గోపాలం సహజంగా పిరికి వాడు కాదు వాడికి దెయ్యాలన్నా, గియ్యాలన్నా నమ్మకం లేదు సరికదా, "ఏడిశావ్, దెయ్యాలా? ఇంకేమైనానా?" అంటూ ఎదురుప్రశ్న వేస్తాడు. అలాంటి గోపాలం సైకిలుమీద బయలుదేరి, ఏలూరు పట్టణ సరిహద్దులు దాటగానే, సైకిలు వేగంగా నడపడం మొదలుపెట్టాడు. అదిరాత్రి ఇంచుమించు ఒంటిగంట ప్రాంతం. అమావాశ్య దాటి 7, 8 రోజులు కావడం వలన సన్నటి వెన్నెల దారి సరిగానే కనిపించేలా చేస్తుంది. కాని ఎదురుగాలి. గోపాలం సైకిలు ప్రయాణానికి కొంచెం ఇబ్బంది అయింది. సైకిలు త్రొక్కడం వలన కలిగే శ్రమ వలన చిరుచెమట పట్టింది.

నోరు కొంచెం ఎండి, మంచినీళ్ళయినా త్రాగి బయలు దేరాను కాదు, అనుకుంటున్న గోపాలానికి, సైకిలు వెనుక క్యారియర్ సీటు మీద ఎవరో కూర్చుని ఉన్నట్లు అనిపించింది.

సైకిలు మరింత ఇబ్బందిగా కదులుతున్నట్లు గ్రహించాడు. ఏమిటా అని వెనుకకు చూసిన గోపాలం గుండె ఒక క్షణం

ఆగి కొట్టుకోవడం మొదలయింది !! ఆ క్షణంలోనే గోపాలం వళ్లంతా చెమటలు పట్టేసింది. ఒక నల్లని ఛాయ, ఎర్రని కనుగుడ్లతో తీక్షణమైన వాడి చూపులతో, తన ముఖం ముందుకి దాని ఇనుప హస్తం లాటి చేతిని చాపింది! ఇనుప అరచెయ్యి, ఉక్కుగోళ్లా అదీ... భయంతో గుండెలు జారిపోయాయి !

అది మరి ఆడదో, మగదో, దయ్యం మాత్రం అయివుంటుందనిపించింది గోపాలానికి! తనకు తెలియకుండానే సైకిల్ వేగం హెచ్చింది. కొంచెం దూరంలో, రోడ్డు ప్రక్కనే ఒక చిన్న బుడ్డిదీపం కనిపించింది. అక్కడ ఒక గుడిశ, దాని ప్రక్కన ఒక చిన్న కొట్టు ఉన్నట్లు జ్ఞాపకం. సిగరెట్లు, సోడాలు అక్కడ దారిని పోయేవారి నిమిత్తం అమ్మబడతాయి. ఆ అర్ధరాత్రి సమయంలో, ఆ కొట్టు తెరిచి వుంటుందనే ఆశ ఎవరికీ కలగదు. అయినా, కూడదీసుకున్న ధైర్యంతో, గోపాలం ఆ గుడిశదగ్గరకు చేరాడు. ఆశ్చర్యం, కొట్టు తెరిచేవుంది. గోపాలం గుండె కొంచెం కుదుటపడింది. గుడిసెలో, బుడ్డిదీపం ముందు కూర్చున్న ఒక ముసలి తాతను చూసి. "తాతా సోడా ఒకటి ఇవ్వు" అంటూ సైకిల్ స్టాండ్ వేశాడు గోపాలం. సోడా త్రాగి, తనకి కలిగిన భయాన్ని పోగొట్టుకోవాలనేమొ, తాతకి తాను చూసిన విశేషం పూర్తిగా చెప్పి, జేబులోని చిల్లర ఐదు పైసలు తీసి ఇవ్వబోయాడు. అంతలో, అదే భయం కలిగించే ఎర్రని కళ్లు, అదే తీక్షణమైన వాడి చూపుతో, తాత "ఇందాక నీవు చూసింది ఈ చెయ్యేనా ?"

# దెయ్యం మంచి

అంటూ తన హస్తాన్ని గోపాలం ముఖం ముందు పెట్టాడు. గోపాలం గుండె ఝల్లుమంది. కాళ్ళు వణికాయి అనుమానం లేదు అదే చెయ్యి; తనని మింగవస్తున్నట్లున్న చెయ్యి...దాంతో కళ్ళు తిరిగి సొమ్మసిల్లిపోయాడు భయంతో. మెలుకువ వచ్చి చూసేసరికి టైము సుమారు ఉదయం నాలుగు గంట లయింది అక్కడ గుడిసె లేదు, ఏమీలేదు అటుగా వెళ్తున్న ఒక లారీ డ్రైవరు, క్లీనరు, వివరాలడిగి తెలుసుకొని ఆశ్చర్య పోయారు. ఇదీ గోపాలానికి జ్వరం రావడానికి కారణం ! !

ఆ తరువాత రెండు రోజులకి గోపాలం జ్వరం తగ్గింది. ఒంట్లో స్వస్థత చేకూరిన తరువాత, ఐదు రోజులకి గోపాలం తిరిగి విజయవాడ బస్సులో వెళ్లి పోయాడు వాడున్న ఆ ఐదురోజులు, ఎప్పటి మాదిరిగానే మేము మా పొలాల్లో, తోటల్లో తిరిగాం ఈ ఐదు రోజులూ, మేము ఈ దెయ్యం విషయంలో అనేకమైన చర్చలు చేసుకున్నాం. గోపాలానికి ఈ అనుభవం కలగక పూర్వం మాదిరి, "దెయ్యాలు లేవు" అని గట్టిగా చెప్పలేక పోయాడు. వసగటం ప్రారంభించాడు.


అసలు దెయ్యాలు ఉన్నాయో లేదో ఎవరికీ సరిగ్గా తెలియదు. ఈ విషయాన్ని సైన్సు కూడా పూర్తిగా ఈ నాటికీ తేల్చి చెప్పలేదు. రాత్రులు గజ్జెల మోత, లంకెబిందెలు కథలు, మొదలైనవి చాలా భయం కలిగిస్తాయి రాత్రులు ఒకోసారి వినవచ్చే గజ్జెలచప్పుడు, పురుగులు చేసే చప్పుడు మాత్రమే అంటుంది సైన్సు. గ్రామాల్లో, దెయ్యం పట్టి చచ్చిపోవడం గురించి కథలు కథలుగా చెప్పుకుంటారు అదేంకాదు, బ్రెయిన్ ఫీవర్ వల్ల ఒక వ్యక్తి అదోక తీరులో ప్రవర్తించడం, ఆఖరికి చచ్చిపోతే, దయ్యం పట్టి చచ్చిపోయాడు అనుకోవడం, పొరపాటు అంటుంది సైన్సు. ఇలా సాగాయి మా చర్చలు. ఏది ఏమైనా, ప్రతి మనిషీ పైకి "దయ్యాలా ? సింగినాదమా??" అంటూ చీకట్లో, మానవ సంచారానికి దూరంలో ఉన్నట్లయితే, దెయ్యాల ఊహల్తో భయపడుతూనే ఉంటాడు! చీకట్లో చిన్న చెట్టే రాక్షసిలాగ, లేక ఏ రాయిగానీ, ఒక వింత వస్తువులాగ అగుపిస్తుంది — ఒప్పుకున్నాడు గోపాలం. ఆఖరికి వాడు విజయవాడ వెళ్లిపోయే రోజు వరకూ ఇవే విషయాలు మళ్లీ మళ్లీ మాట్లాడుకున్నాం !.


ఆ తర్వాత సుమారు నాలుగు నెలలకు నేను ఏలూరు వెళ్దాం అని బస్సుకోసం ఎదురు చూస్తున్నాను. సాయంకాలం ఇంచుమించు ఆరు గంటలు కావచ్చింది. ఒకే సమయంలో రెండు బస్సులు వచ్చి ఆగాయి. ఒకటి పైనుంచి వస్తూ ఏలూరు పోయేది. రెండోది ఏలూరు నుంచి వస్తూ, తాడేపల్లి గూడెం పోయేది. నేను ఏలూరు వెళ్తున్న బస్సు దగ్గరికి పరుగెత్తి ఎక్కబోతున్నంతలో "ఒరేయ్ శంకరం"–అని పిలిచాడు గోపాలం ఏలూరు నుండి వచ్చిన బస్సు దిగుతూ. నేను బస్సు ఎక్కడం ఆగి "ఏరా ? ఏమిటి సంగతులు, ఇదేనా రావడం ?" ప్రశ్నించాను. బస్సు రెండు నిముషాలు ఆగుతుంది ఆ రెండు నిముషాల్లో ఏలూరు వెళ్లి సినిమా చూద్దాం అనుకున్న నా మనసు మార్చి గోపాలం నన్ను తిరిగి వూర్లోకి తీసుకుపోబోయాడు, "రేపు వెళ్దాం లేరా! ఇద్దరం కలిసి"అంటూ.

"శంకరం గారూ బస్సు కదుల్తుంది వస్తారా?" అడిగాడు ఎరిగున్న బస్సు డ్రైవరు. ఆ డ్రైవరు మా ఊరివాడే "అబ్బే లేదండీ, మా గోపాలం వచ్చాడు రేపు వెళ్దాం అనుకుంటున్నాం" చెప్పి వచ్చేశాం.

గ్రామానికి వస్తూ, దారిలో మా పొలం దగ్గర కూర్చొని ఇద్దరం కాసేపు మాట్లాడుకున్నాం. మాటల్లో "ఒరేయ్ శంకరం, ఈ మధ్య ఒక ఇంగ్లీషు పత్రికలో ప్రచురించ

(34వ పేజీ చూడండి)






# ఉపవాసం

భోజనం చెయ్యకుండా ఉండడమే ఉపవాసమని చాలామంది అనుకుంటారు. అంతేకాదు అదివరకు అనుభవిస్తూ ఉండే పదార్థాల అనుభవాన్ని విడిచి పెట్టడం—అంటే విషయ సుఖాలను విడిచి పెట్టడం ఉపవాసం అని అనుకోవచ్చు. సుందరమైన దృశ్యాలను చూడాలనే అభిలాషను విడిచిపెట్టడమేకాక—వాటిని చూడకుండా ఉండటం చక్షురుపాసం. ఈ విధంగానే త్వక్కు, శ్రోత్రం, ఘ్రాణం, రసనలను వాటి విషయాలనుంచి మళ్లించడమున్నూ ఆ యా ఇంద్రియాల ఉపవాసాలన్నమాట.

ఇది స్థూలంగా గోచరించే విషయం.

కాని, ఉపవాస శబ్దానికి ఇది సరియైన అర్థం కానే కాదు.

ఉప—అంటే సమీపమందు వాసం—అంటే ఉండడం— సమీపంగా వర్తించడమని—దగ్గరగా ఉండడమని దీని అర్థం.

ఈ అర్థం బ్రహ్మజ్ఞానానికి సంబంధించినది సుషుమ్నానాడికి మీది చివర నున్న సహస్రారంతో మనస్సును నిలిపి ఉంచడమే ఉపవాసమని గ్రహించవలసి ఉన్నది.

ఇంద్రియ విషయాలు మనస్సునకు స్థానంగా ఉన్నవి. మనస్సు ఏ విషయాలపై పోతుందో వాటిని అనుభవించాలనే కోరిక కలుగుతుంది. అట్టి స్థితిలో మనస్సు అధోముఖమైన వ్యాప్తి కలిగి ఉంటుంది. ఆ విషయాలనుంచి దానిని తప్పించినప్పుడే అది ఊర్ధ్వముఖవ్యాప్తి పొందుతుంది. ఆ మనస్సు విషయాల తోడి సంబంధాన్ని విడిచి పెట్టి, ఊర్ధ్వముఖమైనప్పుడు సాధన మూలంగా సుషుమ్నా నాడినుంచి ఊర్ధ్వగామి అయి, సహస్రారంలో ప్రవేశిస్తుంది.

సుషుమ్నానాడి అంటే వెన్నెముక అనీ, సహస్రారమంటే శిరస్సులో మధ్యభాగమనీ, మెదడుయొక్క ముఖ్యభాగమనీ గ్రహించాలి.

మనస్సు ఇంద్రియవిషయాల సంబంధం విడిచి, పరిశుద్ధమై ఊర్ధ్వముఖమై సహస్రారంలో ప్రవేశించినప్పుడే అనిర్వచనీయమైన ఆనందానుభవం కలుగుతుంది.

సహస్రార ప్రవేశాన్ని మనస్సుకు కలిగించడమనే ఉపవాసానికి తొలికార్యం విషయాల నుండి మనస్సును మళ్లించడం. అందువల్లనే ఉపవాసమనేది ఇంద్రియ నిగ్రహం మూలంగా విషయ సంబంధాన్ని విడిచిపెట్టడంలో ఉపయోగింప బడుతున్నది.

—ఎలిసు వేంకట రమణయ్య

---

# దెయ్యం మంచి

(16వ పేజీ తరువాయి)

బడిన 'దెయ్యాలతో అనుభవం' అనే కథ చెప్పుతాను విను'' చెప్పడం మొదలెట్టాడు గోపాలం.

దెయ్యాలు కొన్ని హానిచేసేవిగా ఉంటాయి. కొన్ని హానికరమయితే, మరికొన్ని సహాయకారిగా కూడా ఉంటాయట. ఆ కథలో, ఒక ఆర్మీ మేజరు తన బంగ్లాలో, కుటుంబాన్ని ఇంటికి పంపియున్న కారణంచేత ఒంటిగా ఉన్నాడు. అది చాలా పెద్ద బంగళా. చుట్టూ, కాంపౌండు, పెద్దతోట. ఇంచుమించు రాత్రి తొమ్మిది గంటలు కావస్తున్న సమయంలో పండు వెన్నెల పిండార బోసినట్లుంది. అవి చలికాలం రోజులు కావడంచేత అప్పుడు తొమ్మిది గంటలే అయినా, జనసంచారం లేక నిశ్శబ్దం ఆవరించుకొని వుంది. ఆ మేజరు వసారాలో, భోజనం అయిం తరువాత విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో, అసహజమైన చల్లనిగాలి 'ఝుమ్మని' శబ్దంతో వీస్తున్నట్లనిపించింది. ఏదో చిన్న అలికిడికి తలెత్తి చూసిన మేజరు తన తోటలో, భయంకరంగా ఉన్న ఒక నల్లటి వ్యక్తి, శవాకారంగా ఉన్న ఒక శరీరాన్ని భుజంపై పెట్టుకొని అలా నడిచి వెళ్ళిపోవడం చూశాడు. ఇటువంటి సన్నివేశాన్ని చూసిన ఆ మేజరు మనసులో ఏదో తెలియని భయం ఆవరించింది ఆ రాత్రంతా తను భయం భయంగానే గడిపాడు. అదే ఆకారం కళ్లలో ఆ రాత్రంతా మెదిలింది.

ఇది జరిగిన రెండో రోజున ఆయన తన స్నేహితుడ్ని కలుసుకోవడానికి ''హోటల్ మధుర''కి వెళ్లి, పనిపూర్తయిన తరువాత వస్తూ, ఐదవ అంతస్తు నుండి క్రిందికి దిగడం కోసం ఎలివేటరు దగ్గరికి వెళ్లాడు అప్పటికే అందులో ముగ్గురు నలుగురు వ్యక్తులున్నారు. అందులో, ఆయనకి క్రితం రాత్రి కనిపించిన ఆకారం కలిగిన వ్యక్తి, లిఫ్ట్‌లో ప్రవేశించబోతున్న మేజర్‌ని రావద్దని వారిస్తూ, లిఫ్ట్ తలుపు మూయడం, అది క్రిందికి దిగి పోవడం జరిగింది. ఆ ఎలివేటరు పెద్ద శబ్దంతో కూలిపడి, అందులోని వ్యక్తులందరూ మరణించారు. కానీ, మేజరువెళ్ళి కూలి పడిపోయిన లిఫ్ట్ లోని వారి నందరినీ చూడగా, తను ఇంతకు క్రితం చూసిన ఆకారం కానీ, దానితాలూకా శరీరంగాని, ఆ మరణించిన వారిలోలేరు. ఆ ఆకారమే మేజరుగారి ప్రవేశం నివారించక పోయి నట్లయితే, ఆయనకూడా వారితోపాటు మరణించి ఉండేవాడు. ఆయన తనకు జరిగిన ఈ అనుభవాన్ని ఆ వారపత్రికలో వ్రాస్తూ, ''ఈ విధంగా నాకు సహాయం చేసిన ఆ ఆకారం, అంతకు ముందు రాత్రి కూడా బహుశా నాకు తెలియని, నేను తెలుసుకొన లేకపోయిన మేలు ఏదయినా చేసిందేమో'' అంటూ వ్రాశాడు

ఇలా మేము కొంతసేపు మాట్లాడి, ఎవరి ఇళ్ళకు వాళ్ళం వెళ్ళిపోయాం. ఆ రెండోరోజు నేను తెలుసుకున్నది వింటే, బహుశా ఎవరూ నమ్మరు. కాని అదినిజం, పచ్చినిజం

నేను ఎక్కి ఏలూరు వెళ్ళవలసిన బస్సు దారిలో ప్రమాదానికి గురై, ఆ బస్సులోని ప్రయాణీకులందరూ తీవ్రంగా గాయపడ్డారు. నలుగురు వ్యక్తులు, డ్రైవరుతో సహా మరణించారు. గోపాలమేవచ్చి, నా ఏలూరు ప్రయాణం ఆపుచేసి వుండకపోతే, నాగతి...? వాడికి కృతజ్ఞత తెలుపుకుందాం అనుకుని వాళ్ళింటికి వెళ్ళాను.

''ఏం మామయ్యా! గోపాలం ఏం జేస్తున్నాడు'' అడిగాను ఇంట్లోకి అడుగు పెడుతూ.

''ఏరా శంకరం, నీకేమయినా పిచ్చా? గోపాలం ఎప్పుడొచ్చాడు? వాడు ఏదోఉద్యోగానికి సంబంధించిన పరీక్షలు వ్రాయడానికి, ఇంతకు నాలుగు రోజుల క్రితమే హైదరాబాద్ వెళ్ళాడట. ఇదిగో ఉత్తరం ... ఈవేళ వచ్చింది హైదరాబాద్ నుంచి''... అంటూ అందించాడాయన. ఆశ్చర్యపోయాడు శంకరం! మరి... తను చూసింది గోపాలాన్ని కాదన్నమాట!! అయ్య బాబోయ్!!